విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాలి వినోద్‌కుమార్ తదితరులు

ఆంధ్రా ఫిల్మ్ ఇండస్ట్రీ వైజాగ్ తరలిపోవాలి

గాలి వినోద్‌కుమార్ సహా పలువురు తెలంగాణ నేతల డిమాండ్

సికింద్రాబాద్,డిసెంబర్24: ఆంధ్రా ఫిల్మ్ ఇండస్ట్రీ తక్షణమే వైజాగ్‌కు తరలిపోవాలని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్‌కుమార్ సహా తెలంగాణకు చెందిన వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ తార్నాకలోని వినోద్‌కుమార్ కార్యాలయంలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. 1956 నుంచి తెలంగాణ సినిమా ఇండస్ట్రీని ఆంధ్రా సినిమా ఇండస్ట్రీ దోపిడీ చేసి లక్షలాది కోట్లు సంపాదించిందని ఆరోపించారు. తెలంగాణ వచ్చి 11 ఏండ్లు గడిచినా ఇక్కడే పరాన్నజీవుల్లా తిష్టవేసి, తెలంగాణ కళాకారులు, సినీరంగంలోని ఇతర విభాగాల వారి అవకాశలను ఆంధ్రా సినిమా ఇండస్ట్రీవారు దోపిడీ చేశారని ధ్వజమెత్తారు. ఉమ్మడి రాజధాని గడువు తీరినా, ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం ఆంధ్రా ప్రాంతానికి తరలిరావాలని పిలిచినా ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. సంధ్య థియేటర్‌లో ఆంధ్రా నటుడు అల్లు అర్జున్ ఓవర్ యాక్షన్ కారణంగానే రేవతి బలైందని ఆరోపించారు. ఆంధ్రా నటులు, ఇతర రంగాల వారు సత్వరమే ఆంధ్రా వెళ్లకపోతే యావత్ తెలంగాణ సమాజం యుద్ధం ప్రకటిస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో గాలి వినోద్‌కుమార్‌తో పాటు తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ కస్తూరి శ్రీనివాస్, తెలంగాణ సినీ మ్యూజిషియన్ యూనియన్ అధ్యక్షుడు రమణ ఒగేటి, చిత్రపురి సాధన సమితి జనరల్ సెక్రటరీ డాక్టర్ భద్ర, తెలంగాణ మ్యూజిక్ డైరెక్టర్ విష్ణు కిషోర్, డైరెక్టర్ జీజే రాజా, కేఎస్ రెడ్డి స్టూడియో అధినేత శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్.. ఆంధ్రా వెళ్లిపో!

› మొదటిపేజీ తరువాయి...

తీసినవ్. అదో స్మగ్లర్ సినిమా. సమాజానికి ఏం మెస్సేజ్ ఇద్దామని పుష్ప సినిమా తీసినవ్. అది సమాజాన్ని బాగు పరిచే సినిమానా? నువ్వు ఆంధ్రోడివి. ఆంధ్రోడిగా బతకడానికి వచ్చావ్. పగటి వేషాలు వేసుకుని బతికే నువ్వు.. హీరోవని గౌరవం ఇస్తున్నాం. దాన్ని కాపాడుకో. డబ్బులు ఖర్చు పెట్టి వ్యాపారం చేసుకుని సంపాదించే నువ్వు సమాజానికి ఏం చేశావ్? తెలంగాణకు నీ కంట్రిబ్యూషన్ ఏముంది? చనిపోయిన వ్యక్తిని పరామర్శించలేని నీది ఏం మానవత్వం? మొన్న జాయింట్ యాక్షన్ కమిటీ వాళ్లు ఇంటి దగ్గర ఆందోళన చేసింర్రు. రూలింగ్ పార్టీ ఎమ్మెల్యేగా చెబుతున్నా.. మరోసారి ఇట్లనే మాట్లాడితే తెలంగాణలో సినిమాలు ఆడనివ్వం. ఆ రోజు సంధ్య థియేటర్ దగ్గర తొక్కిసలాట సందర్భంగా ఏం జరిగిందో మా ముఖ్యమంత్రి మొత్తం చెప్పలేదు. తొక్కిసలాట జరిగి మహిళ చనిపోయింది. మీరు వెళ్లిపోవాలని ఏసీపీ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

చెబితే.. నరబలి అయిపోయింది. సినిమా సూపర్ హిట్ అవుతుందని అంటావా? నీవు మనిషివేనా? మానవత్వం ఉందా? డీసీపీ పోయి వెళ్తావా? అరెస్టు చేయమంటావా? అంటే అప్పుడు బయటకు వస్తావా? ఏదో ఘనకార్యం చేసినట్టు పోయేటప్పుడు కూడా చేతులు ఊపుకుంట పోతవా? మా ముఖ్యమంత్రిని విమర్శిస్తే ఊరుకునేది లేదు. అవసరమైతే కాంగ్రెస్ శ్రేణులు అల్లు అర్జున్ సినిమాలను తెలంగాణలో ఆడనీయం. ఒళ్లు దగ్గర పెట్టుకుని వ్యాపారం చేసుకుంటే చేసుకో. లేకపోతే ఆంధ్రకు వెళ్లిపో' అని ఎమ్మెల్యే భూపతి రెడ్డి వ్యాఖ్యానించారు.

అనుమతి లేకున్నా ఎందుకొచ్చారు?

తొక్కిసలాట ఘటనపై మీరేమంటారు?

- వీడియో చూపిస్తూ ప్రశ్నించిన పోలీసులు
- నాలుగు గంటలపాటు అల్లు అర్జున్ విచారణ
- కేసులో నిందితుల జాబితాలో మైత్రీమూవీస్
- సోషల్ మీడియాలో పుష్ప 2 కొత్త సాంగ్ వైరల్!
- తొలగించాలంటూ పలువురి నుంచి ఒత్తిళ్లు?

హైదరాబాద్ సిటీబ్యూరో/ముషీరాబాద్, డిసెంబర్ 24: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన కేసులో సినీ నటుడు అల్లు అర్జున్ మంగళవారం హైదరాబాద్ చిక్కడపల్లి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. పోలీసుల నోటీసులకు స్పందించిన ఆయన మంగళవారం ఉదయం 11 గంటలకు న్యాయవాదితో కలిసి స్టేషన్‌కు వెళ్లారు. జూబ్లీహిల్స్‌లోని అల్లు ఇంటి వద్ద, చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటుచేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ విచారణ నిర్వహించారు. 4న పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో 11వ నిందితుడిగా ఉన్న అల్లు అర్జున్‌ను పోలీసులు 13న అగమేఘాలపై అరెస్ట్ చేశారు. రిమాండ్ రిపోర్టు తయారుచేసిన తర్వాత అల్లు అర్జున్‌ను హడావుడిగా అరెస్ట్ చేసి, గాంధీ దవాఖానలో వైద్య పరీక్షలు నిర్వహించి, కోర్టులో సరెండర్ చేసిన అనంతరం అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇంతలోనే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో 13న రాత్రి జైల్లో ఉన్న అల్లు అర్జున్, మరుసటిరోజు ఉదయం జైలు నుంచి బయట కొచ్చారు. రిమాండ్ రిపోర్టు ఆధారంగా ఈ విచారణలో పలు ప్రశ్నలను పోలీసులు అల్లు అర్జున్‌ను అడిగినట్టు సమాచారం.

వీడియోను చూపిన పోలీసులు

తొక్కిసలాట ఘటనకు ముందు, తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై పోలీసులు తయారుచేసిన 10 నిమిషాల వీడియోను అల్లు అర్జున్‌కు చూపించారు. పలు రకాల ప్రశ్నలను అల్లు అర్జున్‌పై సంధించినట్లు సమాచారం. 'పోలీసుల నుంచి అనుమతి లేకుండా మీరెలా వచ్చారు? రద్దీ ఎక్కువగా ఉన్నది. మిమ్మల్ని రావద్దని చెప్పాలంటూ థియేటర్ యాజమాన్యానికి కూడా చెప్పాం. మీరు పోలీసుల ఆదేశాలను ఎందుకు పాటించలేదు' అని పోలీసు లు ప్రశ్నించినట్టు తెలిసింది. 'బౌన్సర్లు వీరం గం చేశారు. పోలీసులను కూడా అడ్డుకునే ప్రయత్నం

చిక్కడపల్లి పీఎస్ వద్ద అల్లు అర్జున్

చేశారు. మీ బౌన్సర్లు, మీ నిర్లక్ష్యం కారణంగానే ఘోరం జరిగిందని స్పష్టమవుతుంది. దీనికి మీరేమంటారు?' అంటూ ప్రశ్న ల వర్షం కురిపించినట్టు తెలిసింది. తొక్కిసలా ట జరిగిందని మీకు చెప్పే ప్రయత్నం చేశాం, ముందు మీ మేనేజర్ సంతోశ్‌కు చెప్పినా ప్రయోజనం లేక నేరుగా మీకే చెప్పాం.. మీరు సినిమా పూర్తిగా చూసి వెళ్తానంటూ భీష్మించా రు. డీసీపీ వచ్చి మిమ్మల్ని బయటకు తీసికెళ్లా రు. మీరు అసలు తొక్కిసలాట, మహిళ మృతి చెందిందనే విషయం తెలియదంటూ చెప్పారు. దీనిపై స్పష్టత ఇవ్వాలిలి.. అని పోలీసులు అడిగినట్టు తెలిసింది.

సమాచారలోపంపై ఆరా

'మీకు, సినిమా థియేటర్ యజామాన్యానికి కమ్యూనికేషన్ గ్యాప్ వల్లే ఇది జరిగిందని మీరు భావిస్తున్నారా? ఎట్టి పరిస్థితుల్లోనూ మీరు సినిమా చూడాలనే ఉద్దేశంతో అక్కడికి వచ్చారా? భారీ సంఖ్యలో సినీ అభిమానులు ఉన్న సమయంలో మీరు అక్కడకు వస్తే మరింత రద్దీ పెరిగి తొక్కిసలాట జరిగే అవకాశాలు ఉంటాయనే ఆలోచన ఎందుకు చేయలేదు. మీరు మందీ మార్బలంతో ఆ సమయంలో అక్కడికి ఎలా వచ్చారు. సినిమా ప్రారంభమైన తర్వాత వస్తే నేరుగా థియేటర్ లోపలికి వెళ్లే అవకాశాలు ఉండేవి. ఎందుకు అలా చేయలేదు' అని ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. 4 గంటలపాటు అర్జున్‌ను పోలీసులు విచారించారు. పోలీసులు తయారుచేసిన వీడియోతో పాటు ఇటీవల అర్జున్ ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో వెల్లడించిన అంశాలను పోలీసులు ఈ సందర్భంగా ప్రస్తావించినట్టు సమాచారం.

'దమ్ముంటే పట్టుకోరా షెకావత్' పాట వైరల్

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలీసులు అర్జున్‌ను విచారించారు. అనంతరం పోలీసు అధికారులెవరూ కూడా మీడియాకు అందుబాటులోకి రాలేదు. సెంట్రల్ జోన్ డీసీపీ, చిక్కడపల్లి ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లకు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం. విచారణ కొనసాగుతున్న సమయంలోనే సోషల్ మీడియాలో పుష్ప-2 సినిమాకు సంబంధించిన 'దమ్ముంటే పట్టుకోర షెకావత్' అనే పాటను టీ-సిరిస్ అధికారిక యూట్యూబ్ చానల్‌లో విడుదల చేసింది. ఈ పాట విడుదలైన ఏడు గంటల్లోనే ఐదున్నర లక్షల మంది వీక్షించారు. పాటను తొలగించాలంటూ కొందరు పోలీసు అధికారులు సినిమా యూనిట్‌పై ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలు సైతం వచ్చాయి. సినిమాకు, పాటకు, విచారణకు సంబంధమే లేదంటూ అధికారులు ఈ ఆరోపణలను కొట్టిపారేశారు.

బౌన్సర్ అరెస్ట్..

తొక్కిసలాట ఘటనకు కారకుడంటూ అల్లు అర్జున్ బౌన్సర్ అంథోని జాన్‌ను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేయగా అతనికి బెయిల్ మంజూరైంది. ఈ కేసులో 18 మందిని నిందితులుగా చేర్చారు. ఇందులో ఏ18 నిందితులుగా మైత్రీ మూవీస్ నిర్వాహకులను చేర్చారు.

తొక్కిసలాట కేసు నిందితుల వివరాలు

అగమాటి పెద్ద రామిరెడ్డి (ఓనర్)	ఏ1
అగమాటి చిన్న రామిరెడ్డి (ఓనర్)	ఏ2
ఎం సందీప్	ఏ3
సుమిత్ (పార్టనర్)	ఏ4
అగమాటి వినయ్ (పార్టనర్)	ఏ5
అశుతోశ్‌రెడ్డి	ఏ6
రేణుకాదేవి (పార్టనర్)	ఏ7
అరుణారెడ్డి	ఏ8
నాగరాజు (మేనేజర్)	ఏ9
విజయ్‌చందర్ (లోయర్ బాల్కనీ ఇన్‌చార్జ్)	ఏ10
అల్లు అర్జున్	ఏ11
సంతోష్ (అల్లు అర్జున్ పీఏ)	ఏ12
శరత్‌బన్నీ (అల్లు అర్జున్ మేనేజర్)	ఏ13
రమేశ్	ఏ14
రాజు (సెక్యూరిటీ టీమ్)	ఏ15
వినయ్‌కుమార్ (ఫ్యాన్స్ అసోసియేషన్)	ఏ16
ఫర్వేజ్ (బాడీగార్డ్)	ఏ17
మైత్రీ మూవీస్ (ప్రొడ్యూసర్స్)	ఏ18

సినీ పెద్దలతో సీఎంను కలుస్తాం

- రేవతి కుటుంబానికి అండగా ఉంటాం
- ఆమె భర్తకు ఇండస్ట్రీలో ఉద్యోగం
- ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు.. శ్రీతేజ్‌కు పరామర్శ

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన అనంతర పరిణామాలపై త్వరలో సినీ పెద్దలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎఫ్‌డీసీ) చైర్మన్, నిర్మాత దిల్ రాజు తెలిపారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న రేవతి కుమారుడు శ్రీతేజ్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తొక్కిసలాట ఘటన ఎవరూ కావాలని చేసింది కాదని, ప్రమాదవశాత్తు జరిగిందని తెలిపారు. చిత్ర పరిశ్రమను ప్రభుత్వ దూరం పెడుతుందనేది దుష్ప్రచారమని, ఇండస్ట్రీకి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం చెప్పారని తెలిపారు. తాను అమెరికాలో ఉన్నందున ఇన్నిరోజులు రాలేకపోయానని, అమెరికా నుంచి రాగానే సీఎంను కలిశానని తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులకు ఫుల్‌స్టాప్ పెడదామని చెప్పారు. రేవతి భర్త భాస్కర్‌కు ఫిల్మ్ ఇండస్ట్రీలో పర్మినెంట్ ఉపాధి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. శ్రీతేజ్ పరిస్థితి మెరుగవుతున్నదని చెప్పారు. భాస్కర్ కూతురు బాధ్యతను తాను తీసుకుంటానని దిల్ రాజు ప్రకటించారు.

కేసును వెనక్కి తీసుకుంటా : భాస్కర్

తన కుమారుడు పూర్తిగా కోలుకునేందుకు ఎన్నిరోజులు పడుతుందో స్పష్టంగా చెప్పలేమని వైద్యులు చెప్పారని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ తెలిపారు. తమ వల్ల అల్లు అర్జున్ అరెస్ట్ అవుతున్నారనే బాధతో కేసును వెనక్కి తీసుకుంటున్నానని చెప్పారు. తనపై ఎవరి ఒత్తిడి లేదని, ఘటన జరిగిన రెండో రోజు నుంచి అల్లు అర్జున్ తమకు అండగా ఉన్నాడనే సానుభూతితోనే కేసును వెనక్కి తీసుకుంటున్నానని వివరించారు.

సంపాదనే లక్ష్యంగా సినిమాలా?

చెడుకు నాయకుడిగా ఉండే సినిమా దేనికి సంకేతం: కూనంనేని

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తేతెలంగాణ): నాడు సినిమాలు సమాజ మార్పు కోసం తీస్తే, నేడు సమాజంతో పనిలేకుండా సంపాదనే లక్ష్యంగా తీస్తున్నారని ఎమ్మెల్యే, సీపీఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. సంధ్య థియేటర్ తొక్కిసలాటలో తీవ్రగాయాలపాలై కిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను మంగళవారం ఇతర సీపీఐ నేతలతో కలిసి ఆయన పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శ్రీతేజ్ ఇప్పుడిప్పుడే కొదికొద్దిగా కోలుకుంటున్నాడని కూనంనేని అనంతరం మగ్దుంభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. శ్రీతేజ్‌కు మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ప్రధాన కథానాయకుడు చెడుకు నాయకునిగా ఉండేలా సినిమాలు రూపొందించడం ఇది దేనికి సంకేతమని ప్రశ్నించారు.

సభ్యత లేని సినిమాలకూ అనుమతులు ఇస్తున్న సెన్సార్ బోర్డును పూర్తిగా సంస్కరించాలని డిమాండ్ చేశారు. సందేశాన్ని పంచే చిన్న సినిమాలకూ అన్నిరకాలు ప్రోత్సాహకాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సంధ్య థియేటర్ ఘటనలో హీరో అల్లు అర్జున్ పోలీసులు అరెస్టు చేస్తే దానిని కొన్ని పార్టీల నాయకులు రాజకీయ రంగు పులిమి ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని చెప్పారు. శ్రీతేజ్‌ను పరామర్శించిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ, కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, మంద పవన్ ఉన్నారు.

గ్రూప్స్ అభ్యర్థిని బలవన్మరణం

- హైదరాబాద్‌లో గ్రూప్స్‌కు సన్నద్ధమవుతూ.. మరో నిరుద్యోగ యువతి ఉరేసుకుని ఆత్మహత్య
- సురేఖ మృతదేహాన్ని హడావుడిగా కామారెడ్డి జిల్లా మారుమూల తండాకు తరలించిన పోలీసులు
- వచ్చే నెల 7న పెండ్లి.. అంతలోనే విషాదం

గాంధీ దవాఖాన మార్చురీ వద్ద సురేఖ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే సురేందర్ తదితరులు

సురేఖ(ఫైల్)

ముషీరాబాద్/బన్సీలాల్ పేట, నమస్తే తెలంగాణ (డిసెంబర్ 24): పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మరో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టిన కామారెడ్డి జిల్లాకు చెందిన సురేఖనాయక్ తాను ఉంటున్న హాస్టల్‌లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. వ్యక్తిగత కారణాలా? లేక పోటీ పరీక్షల ఒత్తిడిని భరించలేక బలవన్మరణానికి పాల్పడిందా? అనే కో ణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. చిక్కడపల్లి పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం అవులకుంట తండాకు చెందిన సురేఖనాయక్(24) అశోక్‌నగర్‌లోని ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ గ్రూప్-2, రైల్వే ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నది. సోమవారం తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్నేహితురాలు హాస్టల్ నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే వచ్చి కిందకు దింపారు. కొన ఊపిరితో ఉన్న ఆమె ను గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. పోస్టుమార్టం చేసిన అనంతరం ఆమె మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆ వెంటనే మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కాగా సురేఖకు ఇటీవలే నిశ్చితార్థం జరిగిందని, వచ్చే నెల 7న వివాహం నిర్ణయించినట్టు సమాచారం. తల్లిదండ్రులు కుదిర్చిన వివాహం ఇష్టం లేకనా? లేదా మరేదైనా కారణం ఉన్నదా? అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ మేరకు చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర విచారణ జరపాలి

సురేఖ ఆత్మహత్యపై ఆందోళన వ్యక్తంచేస్తూ పలువురు విద్యార్థులు, ఎస్టీ సంఘాల నాయకులు గాంధీ దవాఖానకు చేరుకున్నారు. సురేఖ మృతిపై విచారం వ్యక్తంచేశారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ డిమాండ్ చేశారు. సురేఖ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేయాలని ప్రకటనలో కోరారు. గాంధీ దవాఖాన వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చిలకలగూడ, చిక్కడపల్లి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

పుష్ప వివాదంతో నీరుగారిన దర్యాప్తు

రెండు వారాలుగా పుష్ప-2 వివాదం నడుస్తుండటంతో పోలీసులు ఇతర అంశాలపై దృష్టి పెట్టడం లేదు. చిక్కడపల్లి పీఎస్ పరిధిలోనే ఈ రెండు ఘటనలు జరిగాయి. అల్లు అర్జున్ విచారణ నేపథ్యంలో చిక్కడపల్లి పోలీసులు రెండు రోజులు అదే హడావుడిలో పడిపోయారు. సోమవారం ఆత్మహత్యకు పాల్పడితే, విచారణ చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి. పోస్టుమార్టం హడావుడిగా చేసి సొంతూరికి మృతదేహాన్ని తరలించేందుకు పోలీసులు ఒత్తిడి చేశారని తల్లిదండ్రులు వాపోయారు.

చిన్నప్పటి నుంచే చదువులో ముందంజ

గాంధారి, డిసెంబర్ 24: అవులకుంట తండాకు చెందిన గుగ్లోత్ బావుసింగ్, లాడుబాయి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సురేఖ రెండో కుమార్తె. చిన్నప్పటి నుంచే చదువులో ముందుండేది. కామారెడ్డి లో డిగ్రీ, ఓయూలో పీజీ పూర్తిచేసిన ఆమె.. జీవితంలో ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నది. సంవత్సర కాలంగా అశోక్‌నగర్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ గ్రూప్-2 పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నది. ఉన్నతోద్యోగం సాధించి తండా పేరు నిలబెడుతుందనుకున్న యువతి ఇలా అకస్మాత్తుగా మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు నెలకొన్నాయి.

సురేఖ మరణం బాధాకరం: బీఆర్ఎస్

సికింద్రాబాద్, డిసెంబర్ 24: సురేఖనాయక్ కుటుంబసభ్యులను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎస్టీసెల్, లంబాడ హక్కుల పరిరక్షణ నాయకులు పరామర్శించారు. విషయం తెలియగానే జాజాల సురేందర్ తదితరులు మంగళవారం గాంధీ దవాఖానకు వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు. పోలీసులతో మాట్లాడి ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఉజ్వల భవిష్యత్ కలిగిన సురేఖ మరణం బాధాకరమని పేర్కొన్నారు. పోలీసులు ఆమె మృతికి గల కారణాలను చెప్పడం లేదన్నారు.

విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి వినతిపత్రం అందజేస్తున్న ట్రస్మా నేతలు

ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల ఖరారుకు కమిటీలు

- జిల్లా స్థాయిలో డీఎఫ్ఆర్సీ, రాష్ట్ర స్థాయిలో ఎస్ఎఫ్ఆర్సీ
- పాఠశాల యాజమాన్యాలతో విద్యా కమిషన్ సంప్రదింపులు
- స్కూళ్లను నాలుగు క్యాటగిరీలుగా విభజించాలని కోరిన ట్రస్మా నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : జిల్లా స్థాయిలో డీఎఫ్ఆర్సీ.. స్టేట్ లెవల్లో ఎస్ఎఫ్ఆర్సీ.. ఇలా రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజుల ఖరారుకు త్వరలోనే రెండు కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ఈ కమిటీలు ఖరారుచేసిన ఫీజులనే పాఠశాలలు వసూలు చేయాలి. రాష్ట్రంలో 11,051 ప్రైవేట్ స్కూళ్లున్నాయి. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ బడులు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇంజినీరింగ్ ఫీజుల కన్నా ఎల్‌కేజీ, యూకేజీ ఫీజులే అధికంగా ఉన్నాయి. దీంతో ప్రైవేట్ స్కూళ్ల ఫీజులపై తెలంగాణ విద్యా కమిషన్ దృష్టిసారించింది. మంగళవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) ప్రతినిధులతో ఫీజులపై సంప్రదింపులు జరిపింది. విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు ఫీజుల ఖరారుపై ట్రస్మా చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ యాదగిరి, ఐవీ రమణారావు, జయసింహాగౌడ్‌తో సంప్రదింపులు జరిపారు. మరో రెండు మూడు సమావేశాల అనంతరం నివేదికను రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించే యోచనలో విద్యాకమిషన్ ఉంది.

రాధాకిషన్‌రావుకు మధ్యంతర బెయిల్

హైదరాబాద్/నాంపల్లి కోర్టులు, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆయన మామ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా ఈ నెల 25 ఉదయం 10 నుంచి 28 సాయంత్రం 5 గంటల వరకు బెయి ల్ మంజూరు చేస్తున్నట్టు జస్టిస్ కే సుజన మంగళవారం ప్రకటించారు. వర్ధంతి కార్యక్రమాలు జరిగే ప్రదేశానికి రాధాకిషన్‌రావును ఎస్కార్ట్‌తో తీసుకెళ్లాలని, కుటుంబసభ్యులను, సమీప బంధువులను కలిసేందుకు అనుమతించాలని, మధ్యంతర బెయిల్ గడువు ముగిసిన వెంటనే ఆయనను మళ్లీ జైలుకు తరలించాలని, అప్పటి వరకు ఆయన ఎలాంటి టెలిఫోన్ లేదా మొబైల్‌ఫోన్ వినియోగించకుండా పర్యవేక్షించాలని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ప్రయాణ ఖర్చులు, ఎస్కార్ట్ చార్జీలను రాధాకిషన్‌రావే భరించాలని స్పష్టం చేశారు.

మ్యాచింగ్ గ్రాంట్‌కు పైసల్లేవ్!

- చెల్లింపునకు 2 రోజులే గడువు
- ప్రత్యామ్నాయం కోసం అన్వేషణ

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అమలుచేసే పథకాలు, అభివృద్ధికి మ్యాచింగ్ గ్రాంట్ కేటాయింపులకు నిధుల కొరత ఏర్పడింది. జల్‌జీవన్ మిషన్, పీఎంఏవై, కృషి సించాయి యోజన, పీఎం పోషణ తదితర పథకాలతోపాటు రైల్వేలు, రహదారులు, ఎయిమ్స్ వంటి వాటికి రాష్ట్ర వాటా నిధులు చెల్లించాల్సి ఉన్నది. రాష్ట్ర ఖజానా నిండుకోవడంతో రేవంత్ సర్కార్ ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నట్టు సమాచారం. ఆర్థికశాఖపై ఇటీవల సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్.. కేంద్రం నుంచి వీలైనన్ని గ్రాంట్లు రాబట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. వివిధ శాఖలు, పథకాల వారీగా కేంద్రం అందించే మ్యాచింగ్ గ్రాంట్‌ని 100% సద్వినియోగం చేసుకోవాలని సూచించినట్టు సమాచారం. కొంతమేరకు రాష్ట్రం వాటా చెల్లిస్తే, కేంద్రం తన వంతు ఇచ్చే వాటా నిధులను ఎట్టిపరిస్థితుల్లో వదులుకోవద్దని సర్కారు భావిస్తున్నది. రాను న్న బడ్జెట్ కోసం ఇప్పటికే ప్రతిపాదనలు కోరి న ఆర్థికశాఖ.. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించినట్టు సమాచారం. రాష్ట్రంలో అమలుచేయగలిగిన కేంద్ర పథకాలను అన్ని శాఖలు గుర్తించాలని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నాలుగో విడతగా కేంద్ర పథకాల అమలు కోసం రాష్ట్ర వాటాగా రూ.1000-1200 కోట్లు విడుదల చేస్తే, 6,000 కోట్ల వరకు కేంద్ర నిధులు ఇచ్చే అవకాశం ఉంటుందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నెల 26లోగా మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయాలని కేంద్రం గడువు విధించినట్టు తెలిసింది. రెండ్రోజులే గడువు ఉండగా, రాష్ట్ర వాటా ఇద్దామనుకుంటే ఖజానా నిండుకున్నది. సంక్రాంతి నుంచి రైతు భరోసా అమలుచేయాలని సర్కారు భావిస్తున్నది. ఇప్పుడు ఆ నిధులను మ్యాచింగ్ గ్రాంట్‌కు చెల్లించి కేంద్రం నుంచి వచ్చే నిధులను రైతుభరోసా పథకానికి మళ్లించే అవకాశాలను పరిశీలిస్తున్నట్టు సమాచారం. మొదటి ఏడాదిలోనే మ్యాచింగ్ గ్రాంట్ కోసం రేవంత్ సర్కారు ఆపసోపాలు పడుతుండడం గమనార్హం.

వ్యవసాయ భూముల్లో సోలార్ ప్లాంట్లు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : పీఎం కుసుమ్ పథకం కింద వ్యవసాయ భూముల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆదేశాలిచ్చినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ఐదు మెగావాట్ల నుంచి రెండు మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు, రైతు బృందాలు, సహకార సంఘాలు, ఎఫ్‌పీవోలు అసోసియేషన్లు ఈ పథకం కింద టీజీరెడ్‌కోకు దరఖాస్తు చేసుకోవచ్చని భట్టి వెల్లడించారు.

ప్రైవేట్ స్కూళ్లపై సర్కారు పెత్తనం

- ఫీజుల నియంత్రణ పేరుతో కొరడా
- బడ్జెట్ స్కూళ్లే బలిపశువులు
- బడా స్కూళ్లను గాలికొదిలేసిన పాఠశాల విద్యాశాఖ

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : 'రాష్ట్రంలో 30 వేల ప్రభుత్వ స్కూళ్లంటే 24 లక్షల మంది విద్యార్థులున్నారు. ప్రైవేట్‌లో 10వేల పాఠశాలలంటే 34 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో సర్కారు టీచర్లకంటే ఎక్కువ చదువుకున్నవారున్నారా..? గొప్ప వ్యక్తులున్నరా..? ఉపాధి హామీ కూలీలు కూడా కాన్వెంట్‌కు పంపిస్తున్నరు.' ఇది గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఓ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు. రాష్ట్రంలో 10,832 ప్రైవేట్ స్కూళ్లుంటే వీటిలో 9వేల వరకు బడ్జెట్ స్కూళ్లే. చిన్నా చితకా స్కూళ్లల్లో ఉండేది 100-200 మంది విద్యార్థులే. బీఈడీ పూర్తిచేసినవారు.. టీచర్ కొలువు దక్కించుకోలేకపోయిన వారు పొట్టకూటి కోసం ఏర్పాటు చేసుకున్నవే. ఇలాంటి బడ్జెట్ స్కూళ్లపై కాంగ్రెస్ సర్కారు పెత్తనం చెలాయించబోతున్నది. ఫీజుల నియంత్రణ పేరుతో చిన్నా చితకా స్కూళ్లపై కొరడా ఝుళిపించనుంది. సర్కారు ఆగ్రహానికి బడ్జెట్ స్కూళ్లు బలిపశువులు కానున్నాయి. స్కూళ్లు మూతపడనున్నాయి. ఏకంగా రెండు లక్షల మంది ప్రైవేట్ టీచర్లు, మరో రెండు లక్షల మంది సిబ్బంది రోడ్డునపడనున్నారు. దీంతో పాటు ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకం కానుంది.

బడ్జెట్ స్కూళ్లల్లో ఫీజు 25వేల లోపే

బడ్జెట్ స్కూళ్లు రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాయి. టీచర్లు, సిబ్బంది, బస్సులు, ఆటోలు, వ్యాన్ల యజమానులు, డ్రైవర్లకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ స్కూళ్లల్లో ఫీజులు నామమాత్రంగానే ఉంటున్నాయి. బడ్జెట్ స్కూళ్లల్లో ఫీజులు సగటున 25వేల లోపే ఉన్నట్టు ట్రస్మా నేతలంటున్నారు. కానీ తామేదో ఫీజుల దోపిడీ చేసినట్టు చూడటం తగదని వారంటున్నారు. కరోనాతో అనేక ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న తరుణంలో తమను ఇబ్బందులకు గురిచేయడం తగదని వాపోతున్నారు. భవనాల అద్దెలు, బ్యాంకు రుణాలు, వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని గుర్తుచేస్తున్నారు.

బడా స్కూళ్లపై నియంత్రణేదీ..

రాష్ట్రంలో కార్పొరేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లను విద్యాశాఖ గాలికొదిలేసింది. ఇంటర్నేషనల్ పేరుతో కొన్ని స్కూళ్లు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. కొన్ని స్కూళ్లల్లో ఇంజినీరింగ్ ఫీజుల కన్నా కిండర్ గార్డెన్ ఫీజులే అధికంగా ఉంటున్నాయి. ఆయా స్కూళ్లను విద్యాశాఖ అస్సలు పట్టించుకోవడం లేదు. గతంలో కొవిడ్ సమయంలో హైదరాబాద్‌లోని 10 పాఠశాలలు తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి ఫీజులు వసూలు చేశాయి. విచారణ పేరుతో హడావుడి చేసిన విద్యాశాఖ ఆ తర్వాత ఈ విషయాన్ని వదిలేసింది. తాజాగా ఏర్పాటు చేసే ఫీజు రెగ్యులేటరీ కమిటీ (ఎఫ్ఆర్సీ) సైతం చిన్న స్కూళ్లపై పెత్తనానికేనన్న విమర్శలొస్తున్నాయి. బడ్జెట్ స్కూళ్లపై పెత్తనం చెలాయించకుండా బడా స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించడంపై అటు విద్యాశాఖ, ఇటు విద్యా కమిషన్ దృష్టిసారించాలని పాఠశాల యాజమాన్య సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు.